క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వీరఘట్టం: మండలంలోని పాపంపేట జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు యశతో పాతు(17) మంగళవారం మృతి చెందినట్లు ఎస్.ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం శ్రీరాంనగర్‌కు చెందిన యువకుడు సంక్రాంతి పండగకు పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం గడసింగుపురంలో ఉన్న తన మేనత్త ఇంటికి వెళ్లి, తిరుగు ప్రయాణంలో బైక్‌పై వెళ్తుండగా సీఎస్‌పీ రోడ్డులో పాపంపేట జంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హెచ్‌సీ టి.పోలయ్య కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ మురళీధర్ కోరారు. పట్టణంలోని పలు సెంటర్ల వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ రోజులు కావడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉందన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.

పర్యాటకుల సందడి



తోటపల్లి పర్యాటక కేంద్రం వద్ద సందర్శకులు

గరుగుబిల్లి: తోటపల్లి పర్యాటక కేంద్రం వద్ద మంగళవారం పర్యాటకుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు ఇక్కడకు చేరుకుని ఆటపాటలతో సరదాగా గడిపారు. అలాగే చిలకాం, తోటపల్లి, నాగూరు తదితర గ్రామాల్లోని నాగావళి నదీ తీరం వద్ద సందర్శకుల కోలాహలంగా నెలకొంది.

గ్రామాల్లో 8 రకాల వైద్యపరీక్షలు



కృష్ణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న, వైద్యాధికారి కృష్ణంరాజు

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లో 8రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని, ఇంటింటికీ వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి కృష్ణంరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 15రోజులకోసారి గ్రామంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ఈ వైద్యశిబిరంలో 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మంచాన పడి ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని చెప్పారు. రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

ఆయుర్వేద మందులతో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ

సీతానగరం: దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆయుర్వేద మందులు ఉపయోగపడతాయని బూర్జ ఆయుష్ వైద్యాధికారి టి.హేమలత అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె బూర్జ ఆయుర్వేద ఆస్పత్రిలో మాట్లాడుతూ ఆయుర్వేదంలో వివిధ రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులను ప్రభుత్వం సమకూర్చిందని చెప్పారు. గ్రామాల్లో సుగర్, కీళ్ల వాపులు, నొప్పులు, పొట్టలో మంట, అజీర్ణం, రక్తపోటు, కాళ్లుచేతుల తిమ్మిర్లు, బీపీ తదితర వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు ఎక్కువ మంది వస్తున్నారని తెలియజేశారు. ఆస్పత్రికి రాలేని రోగులకు ఇళ్లలోనే వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో రోజుకు 30 నుంచి 40 మంది రోగులకు వైద్య సేవలందిస్తున్నామన్నారు. అలాగే గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రికి విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారా? ప్రశ్నించగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

వ్యవసాయానికి వెన్నుదన్ను



పంపుసెట్టు సాయంతో పొలానికి నీరు పెడుతున్న దృశ్యం

- బోర్లకు ఉచిత విద్యుత్‌తో రబీసాగుకు ఊతం
- పగటిపూట తొమ్మిది గంటల పాటు నిరంతర సరఫరా

పాలకొండ నియోజకవర్గంలో..		
మండలం	బోర్లు సంఖ్య	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
భామిని	387	1835
సీతంపేట	123	615
పాలకొండ	609	3045
వీరఘట్టం	542	2710

భామిని:

రబీలో నీటివసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు రెండో పంటగా వరిసాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాగునీటి కాలువలు, చెరువుల ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులతో పాటు సాగునీటి బోర్లు ఉన్న రైతులు రబీ వరినాట్లకు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రబీలో వరినాట్లుకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పటికే పొలాలను దుక్కి చేసి వరినారు వేసేందుకు రైతులు సిద్ధం చేశారు.

తొలగిన సాగునీటి ఇబ్బందులు

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ బోర్లకు రాత్రిపూట విద్యుత్ సరఫరా చేసేవారు. దీంతో రైతులు రాత్రి సమయంలో పొలాల్లో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఎప్పుడు విద్యుత్ సరఫరా వస్తుందో తెలియక అన్నదాతలు వేచి చూడాల్సి వచ్చేది. రాత్రి పూట పొలాలకు వెళ్లే సమయంలో రైతులు ప్రమాదాలకు గురయ్యేవారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో రైతుల ఇబ్బందులను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పగటిపూట నిరంతరంగా 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిర్ణయంతో నియోజకవర్గంలో వ్యవసాయ పంపుసెట్లు ఉన్న వందలాది మంది రైతులు ఏడాదంతా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. సాగునీటి కష్టాలు తొలగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బోర్లుతోనే వ్యవసాయం

రెండో పంటగా వరి సాగుచేస్తున్నాం. వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట 9గంటల ఉచిత విద్యుత్ సరఫరాతో సాధ్యపడుతోంది. ప్రమాదాలు లేకుండా పగటిపూట కరెంట్ ఓకేసారి అందిస్తుండడంతో సాగు సులభతరంగా మారింది.

– మునగవలస నూకయ్య, రైతు, నేరడి–బి, భామిని మండలం

పంపుసెట్ల కింద పెరిగిన సేద్యం

విద్యుత్‌తో నడిచే పవర్ పంపుసెట్లుతో రబీ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. సాగునీటి ఇబ్బందులు తొలగడంతో రైతులు రబీలో వరిసాగుకు ఆసక్తి చూపుతున్నారు.

– కొర్ను సింహాచలం, మండల వ్యవసాయ అధికారి, భామిని



రబీలో సాగుచేసేందుకు సిద్ధం చేసిన వరినారు

విధినిర్వహణలో అలసత్వం తగదు

పాలకొండ రూరల్: విధినిర్వహణలో అలసత్వం తగదని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని అంపిలి, గొట్ట మంగళాపురం, చిన్న మంగళాపురంతోపాటు కొండాపురం గ్రామ సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పండగల నేపథ్యంలో సిబ్బంది విధులకు డుమ్మాకొట్టకుండా అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల బట్వాడాపై ఆరాతీశారు. పీఎంజేఏవై సర్వే సక్రమంగా చేపట్టాలన్నారు. రికార్డులు, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామీణుల ఆరోగ్య రక్షణపై దృష్టిపెట్టాలని, రోజువారీ నివేదికలు తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.



గొట్ట మంగళాపురం సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేయండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



నియామకపత్రాలను అందిస్తున్న, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ప్రజాప్రతినిధులు

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పనిచేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర హితవు పలికారు. మున్సిపాలిటీలో ఇటీవల నూతనంగా నియమితులైన 15 మంది వలంటీర్లకు మంగళవారం ఆయన పట్టణంలోని తన గృహంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ సమక్షంలో నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సంక్షేమ పాలన అందిస్తున్నారని, ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా వలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావు, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● పొగమంచు



కొద్దిరోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటల వరకు మంచు కురుస్తుండడంతో రహదారులు సరిగా కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు కారణంగా మామిడి, జీడి, పెసర, మినప పంటల పూత రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

పాలకొండ రూరల్

దూడల సంరక్షణతో పాడి సమృద్ధి

- పశువు ఈనే ముందు, తర్వాత శ్రద్ధ అవసరం



పార్వతీపురం: పుట్టిన ప్రతి దూడను బతికించుకోవాల్సిన అవసరం ఉంది. సాధారణంగా పుట్టిన దూడల్లో 30 నుంచి 40 శాతం మరణిస్తూ రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. గేదె దూడల విషయానికి వస్తే చలికాలంలో 33 శాతం, వర్షాకాలంలో 31 శాతం, వేసవిలో 15 శాతం చనిపోతున్నట్లు ఒక నివేదిక చెబుతోంది. పుట్టిన తర్వాత 60 రోజుల్లోపు మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ సమయంలో దూడల సంరక్షణ, పోషణ విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని పశు వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

- చూలుతో ఉన్న పశువు ఈనే ముందు మూడు నెలలు, తర్వాత మూడు నెలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పశుపోషణలో భాగంగా పుట్టిన దూడల్ని బతికించుకుని మరణాల శాతాన్ని తగ్గించుకోవడానికి సరైన పోషకాలు అందించి, సకాలంలో వైద్య చికిత్సలు చేయించాలి.

పాలే సంపూర్ణ ఆహారం

పుట్టిన తర్వాత దూడల్ని తల్లినుంచి ఒకరోజు లేదా నాలుగైదు వారాలు లేదా మూడు నెలల వయసులో వేరు చేస్తుంటారు. ఒకరోజు వయసులో వేరు చేసినపుడు వాటికి పాలు మాత్రమే సంపూర్ణం ఆహారం. దూడలకు ఇచ్చే పాలపాత్రలు, బాటిల్స్ గానీ శుభ్రంగా లేకపోతే విరోచనాలు అవుతాయి. దూడకు ఇచ్చే పాల ఉష్ణోగ్రత శరీర ఉష్ణోగ్రతతో సమానంగా ఉండాలి. పాలు పట్టించేటప్పుడు బాటిల్ ద్వారా అయితే తల్లి పొదవు ఎంత ఎత్తులో ఉంటుందో అంతే ఎత్తులో ఉంచి తాగించాలి. ఇలా తాగిస్తే పారుడు వ్యాధి రాకుండా నివారించవచ్చు.

వేరు చేసిన దూడల్లో మరణాలు

తల్లితో ఉన్న దూడల కన్నా వేరు చేసిన దూడల్లో మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. వేరు చేసిన దూడల్ని గాలి, వెలుతురు బాగా ప్రసరించే పరిశుభ్రమైన ప్రదేశాల్లో ఉండాలి. పరిశుభ్రత లేకుంటే ఊపిరితిత్తుల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వాటికి ఇచ్చే ఆహారాన్ని అకస్మాత్తుగా మార్చడం వల్ల ఒత్తిడికి గురై తక్కువ ఆహారం తీసుకుంటాయి. దీనివల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గుతుంది. వేసవిలో పాకలో బయట ఉష్ణోగ్రత కన్నా వేడి తక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

పరాన్నజీవుల్ని నిర్మూలించాలి

బాహ్య పరాన్నజీవుల్ని నిర్మూలించాలి. దీనికోసం దూడల శరీరంపై వెంట్రుకలు కత్తిరించాలి. చిన్న వయసులో ఎండు మేతను ఇచ్చినపుడు, జున్ను పాలు తాగించకపోయినా అవసరమైన నీటిని అందించకపోయినా మలబద్ధకం వస్తుంది. నివారణకు ఆముదం, కోడిగుడ్డు తెల్ల , ఇంగువ మిశ్రమాన్ని ఇవ్వాలి.

అంటువ్యాధుల నిర్మూలన ఇలా..

దూడల్లో అంటువ్యాధుల నిర్మూలనకు ప్రణాళికాబద్ధంగా వైద్య చికిత్సలు చేయిస్తే మరణాల శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

- పుట్టిన మొదటి రోజు ధనుర్వాతం నివారణకు టెటనస్ మందు వేయించాలి..
- పుట్టిన ఏడో రోజు నట్టల నివారణకు పైపర్ జన్ అడిపేట్ 15 ఎం.ఎల్ ఇవ్వాలి.
- పుట్టిన ఆరునుంచి ఎనిమిదో రోజు వరకు తెల్ల పారుడు వ్యాధి నివారణకు 2 గ్రాములు నియోమైసిన్, ఆర్బీటెట్రాసైక్లిన్ ఇవ్వాలి.
- ఒకటో నెల నట్టల నివారణకు 20 ఎంఎల్ హైపర్ ఆన్ అడిపేట్, రెండో నెలలో 25 ఎంఎల్, మూడో నెలలో 25 ఎంఎల్ మందు తాగించాలి. 15 రోజుల తర్వాత బూస్టర్ డోస్ ఇవ్వాలి. తర్వాత ఆరు నెలలకు తిరిగి అదే మందు ఇవ్వాలి.
- నాలుగో నెలలో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్ జీవితకాలంలో ఒకసారి ఇస్తే సరిపోతుంది.
- నాలుగో నెలలోనే థైలేరియాసిస్ వ్యాధి నివారణకు సంకరజాతి దూడలకు 3 ఎంఎల్ రక్షా వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇలా ఏడాదికి ఒకసారి ఇప్పించాలి.
- ఐదోనెల గొంతువాపు నివారణకు 3 ఎంఎల్ టీకా మందు ఇప్పించాలి. ఆరు నెలలకోసారి గొంతువాపు టీకా తప్పనిసరిగా ఇప్పించాలి.
- ఆరోనెల జబ్బవాపు నివారణకు మందు 3 ఎంఎల్ తాగించాలి. ఈ మందు ఏడాదికి ఒకసారి విధిగా రెండో నెల గాలికుంటు వ్యాధి నివారణలో భాగంగా ఇవ్వాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులు ఈనిన తరువాత దూడలను సంరక్షించేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన తరువాత రెండు నెలలవరకు మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. పుట్టిన తరువాత వ్యాక్సిన్‌లు వేయించడంతోపాటు దూడకు అవసరమైన ముర్రుపాలను అందిస్తే మరణాల శాతం గణనీయంగా తగ్గించవచ్చు. దూడలను కాపాడుకుంటే పశువులు వృద్ధి చెందుతాయి.

–డా. కె.ప్రసాద్, పశుసంవర్థక సహాయ సంచాలకుడు, పార్వతీపురం మన్యం జిల్లా.

కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్



తిరుగు ప్రయాణాలతో రద్దీగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్

పాలకొండ రూరల్: సంక్రాంతి పండగ సందర్భంగా ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల సౌకర్యార్థం ఐదు రోజులుగా అదనపు సర్వీసులు నడుపుతోంది. దీంతో స్థానిక డిపోకు వచ్చే రోజువారీ ఆదాయం పెరిగినట్లు డీఎం పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పండగ సెలవులు ముగించుకుని మంగళవారం నుంచి ప్రజలు తిరుగు ప్రయాణాల్లో నిమగ్నమయ్యారు. దూర ప్రాంత ప్రయాణికుల కోసం స్థానిక డిపో నుంచి విజయవాడ, విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు అధనంగా సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణాలకు సిద్ధం కావటంతో ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడింది. సమీప దూరాలకు కుటుంబాలతో వెళ్లేవారు, ఉద్యోగులు, వలస కుటుంబాలు ప్రైవేటు వాహనాలపై ఆధారపడ్డారు.

ఉపాధిమార్గాల కల్పనపై దృష్టి

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లో ఉపాధి మార్గాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవరావు తెలిపారు. పాలకొండ అర్బన్ పరిధిలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ దాదాపు 14 వందల గృహాలు నిర్మాణం కానున్న ఈ ప్రాంతలో టెక్స్‌టైల్స్, హేండ్లూమ్ డిపార్టుమెంట్ నేతృత్వంలో ఉపాధి మార్గల కల్పనకు, సంబంధిత పరిశ్రమలు, షాపుల ఏర్పాటుకు అవసరమగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లా డీహెచ్‌టీఓ ధర్మారావుతో కలిసి మంగళవారం కాలనీలో స్థల పరిశీలన చేపట్టినట్లు ఏఈ పేర్కొన్నారు. త్వరలో ఈ ప్రాంతంలో ఉపాధి, అభివృద్ధి మార్గాలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

మన బడి నాడు నేడు పనులు వేగవంతం చేయాలి

సీతానగరం: విద్యాభివృద్ధి కోసం మనబడి నాడు నేడు పథకం ద్వారా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని ఎస్ఎస్ఏ జిల్లా కోర్డినేటర్లు సీహెచ్ శ్రీనివాసరావు, వైకేబీ హరి ప్రసాద్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు సీతానగరంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఎంఈఓ జి సూరిదేముడు ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు ఎస్ఏ–1 పరీక్షల నిర్వహణపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మన బడి నాడు నేడు పథకం ద్వారా మంజూరైన నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు చేపట్టడానికి, అదనపు పాఠశాల భవనాలు, ప్రహరీల నిర్మాణం, పాఠశాలల మరమ్మతులు చేపట్టడానికి, మౌలికసదుపాయాలు కల్పించడానికి పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. పనులు వేగవంతంగా చేయడానికి ఇంజినీరింగ్ అధికార సిబ్బందిపై ఒత్తిడి తేవాలని ఎంఈఓ సూరిదేముడును కోరారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఇటీవల జరిగిన ఎస్ఏ–1 పరీక్షా పేపర్లను తగుజాగ్రత్తలతో పరిశీలించేలా చూడాలని కోరారు. అనంతరం ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ జిల్లా కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, హరిప్రసాద్

ఆత్మీయ సత్కారం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ప్రస్తుత హెచ్ఎం వైకుంఠరావు నేతృత్వంలో 1999–2004 సంవత్సరం మధ్య చదువుకున్న విద్యార్థులు, బోధించిన ఉపాధ్యాయులు ఒకచోట కలుసుకుని నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సైఫన్ సేవలకు వీడ్కోలు



ఎగువ నుంచి వచ్చి సైఫన్‌లో పడుతున్న నాగావళి నీరు



పైన సిమెంటు కట్టడంతో ఉన్న 100 మీటర్ల పొడవున్న సైఫన్ ఇదే..

వీరఘట్టం:

సైఫన్.. ఇది ఒక భూగర్భ జలమార్గం. కాలువ ద్వారా సాగునీటి ప్రవాహానికి వాగులు, గెడ్డలు అడ్డుగా ఉన్నప్పుడు వాటి కింద నుంచి సొరంగ మార్గం ద్వారా పంటపొలాలకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నిర్మాణం . జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి, వీరఘట్టం మండలం సంత–నర్సిపురం గ్రామాల మధ్య నాటి బ్రిటీష్ పాలకులు దీన్ని నిర్మించారు. సుమారు వంద సుమారు వంద అడుగుల లోతులో.. వంద మీటర్ల పొడవున దీన్ని నిర్మించారు. తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో నాగావళి ఎడమ కాలువ ప్రవాహానికి ఒడ్డిగెడ్డ అడ్డుగా ఉండడంతో నాగావళి నీటిని గెడ్డకు అవతల ఉన్న పంటపొలాలకు తరలించేందుకు సైఫన్ ఏర్పాటు చేశారు. నాగావళి కాలువ నీరు 100 అడుగుల లోతున్న పెద్దబావిలో పడి సుమారు వంద మీటర్ల పొడవున్న సైఫన్ గుండా ప్రవహించి 50 అడుగుల ఎత్తులో ఉన్న బావి నుంచి బయటకు వచ్చేలా నిర్మించిన అద్భుత కట్టడం. 2016 ఆగస్టు 18 నాటికి ఇది వందేళ్లు పూర్తి చేసుకుంది. తోటపల్లి పాత ఆయకట్టు కాలువ ఆధునీకరణ పనుల్లో భాగంగా దీన్ని తొలగించి దీని స్థానంలో దోని (వయోడక్ట్) నిర్మించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. మరికొద్ది రోజుల్లో వందేళ్ల చరిత్ర కలిగిన ఈ అద్భుత నిర్మాణం భూగర్భంలో కలిసిపోనుంది.